క్లుప్తంగా

ఉచిత కాలిగ్రఫీ శిక్షణ తరగతులు

కాచిగూడ: జీవీఆర్ కరాటే అకాడమీలో 15 రోజుల పాటు ఉచిత కాలిగ్రఫీలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్ రెడ్డి తెలిపారు. బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ వేమూరి తాండవ కృష్ణ ఆధ్వర్యంలో బాలబాలికలకు ఈ శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ఈనెల 10 నుంచి 25 వరకు రోజూ ఉదయం 7:30 గంటల నుంచి 8:30 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. 10 ఏళ్ల నుంచి 15 ఏళ్ల బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లక్ష్మీమణికి అభినందన పురస్కారం

కాచిగూడ: ఫాస్ ఫిల్మ్ సొసైటీ సిల్వర్ జూబ్లీ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం విజయానికి తోడ్పడిన ఫాస్ ఫిల్మ్ సొసైటీ ముంబాయి చైర్‌పర్సన్ లక్ష్మీమణి మోహన్‌రావును సినీనటుడు సుమన్, సంస్కృతి రత్న డాక్టర్ కె.ధర్మారావులు ఘనంగా సత్కరించి అభినందన పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఫాస్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ కె.ధర్మారావు మాట్లాడుతూ.. సిల్వర్ జూబ్లీ వేడుకల విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఆయన మంగళవారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా వేంకటేశ్వర కల్యాణోత్సవం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చిక్కడపల్లిలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, బిందె తీర్థం, పవనం, బలిహరణ, బాల బోగం, మంత్రపుష్పం, వేదపారాయణం తదితర కార్యక్రమాలను చేపట్టారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.రామాంజనేయులు పర్యవేక్షణలో ఆలయ వంశీయులు శ్రీనాథ్‌గౌడ్, కీర్తన దంపతులు పాల్గొన్నారు.

ఘంటసాల, పి.సుశీల జీవన సాఫల్య పురస్కారం ప్రదానం

చిక్కడపల్లి: ప్రముఖ గాయని కలగ రాజరాజేశ్వరికి ఘంటసాల, పి.సుశీల సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో నవరాగమాలిక సమర్పణలో మధుర సంగీతం కార్యక్రమం నిర్వహించారు. రాజరాజేశ్వరితోపాటు కల్యాణి దేశ్‌పాండే, శ్యామల, సావిత్రి, లలిత, రామకృష్ణ, ప్రభాకర్, కేవీరావు, శర్మ, రవిశంకర్, రమేష్ తదితరులు గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఘంటసాల గానసభ నిర్వహకురాలు కేవీరావు, కె.శారదలు రాజరాజేశ్వరికి జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. బీజేపీ నాయకురాలు రూపా సుధాకర్‌రెడ్డి, మిమిక్రీ ఆర్టిస్ట్, వ్యాఖ్యాతా బుర్రా మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశనుంచే పొదుపు చేయడం అలవర్చుకోవాలి

కాచిగూడ: విద్యార్థి దశ నుంచే విద్యార్థులు పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని అప్పుడే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని హెచ్‌డీఎఫ్‌సీ క్లస్టర్ హెడ్ వీపీ అనన్య సిమాలి అన్నారు. ఎంఎస్ఎస్ లా కళాశాల, ఆర్.జీ.కేడియా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కాచిగూడలోని కళాశాలలో 'ఫైనాన్షియల్ లిటరసీ' అనే అంశంపై సెమినార్‌లో ఆమె పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు ఆరిథ్కంగా ఎదిగినప్పుడే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారన్నారు. విద్యార్థి దశ నుంచే పొదుపు చేస్తే ఉన్నత చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పేర్కొన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ మేనేజర్ మాధవిగుప్తా, అర్పిషా, పల్లవి జైన్, కోమల్ అగర్వాల్, శివాణి అగర్వాల్, కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ డీవీజీ క్రిష్ణ, ప్రొఫెసర్ వందన సాంబ తదితరులున్నారు.

సత్తా చాటిన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు


మూడో టాపర్‌గా అభ్యుదయ సుధ

కాచిగూడ: ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెచ్ఈసీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి పరబత్తిన అభ్యుదయ సుధ 500 మార్కులకు 471 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 3వ టాపర్‌గా నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైఎస్ స్వర్ణలత తెలిపారు. 487 మార్కులతో మొదటి టాపర్‌గా హనుమకొండ విద్యార్థి కల్ల సందేష్, 476 మార్కులతో రెండో టాపర్‌గా నల్గొండ విద్యార్థి షేక్ అయోషా ఫిర్‌దోష్ నిలిచారు. తమ కళాశాల విద్యార్థి పరబత్తిన అభ్యుదయ సుధ రాష్ట్రస్థాయిలో 3వ టాపర్‌గా నిలవడం పట్ల ఆయనను ప్రిన్సిపల్ స్వర్ణలత, లెక్చరర్స్ ఈ సందర్భంగా అభినందించారు.

- ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో బీపీసీలో ఎ.సాయికుమార్ 956 మార్కులు, ఎంపీసీలో జి.నిఖిల్ 968 మార్కులు, హెచ్ఈసీలో మాధవిలత 934 మార్కులు, సీఈసీలో హెచ్ శ్రీకన్నె 928 మార్కులు, హెచ్ఈసీలో అనంద్ 882 మార్కులతో కళాశాల టాపర్స్‌గా నిలిచారని ఆమె వివరించారు.

మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి

- నియోజకవర్గాల్లో పర్యటించిన ఎమ్మెల్యేలు
- స్థానిక సమస్యలను పరిష్కరిస్తామని హామీ


జ్యోతినగర్‌లో స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గంలో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి కనీస సౌకర్యాలు కల్పించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ప్రజలు కూడా అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములైతే నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. మంగళవారం కవాడిగూడ డివిజన్ జ్యోతినగర్‌లో మున్సిపల్, జలమండలి అధికారులతో కలిసి ఎమ్మెల్యే ముఠాగోపాల్ బస్తీలో పాదయాత్ర చేసి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జ్యోతినగర్ వాసులు పురాతన డ్రైనేజీ పైపులైన్ల వల్ల నిత్యం ఇబ్బందులు పడుతున్నామన్నారు. తాగునీటిలో మురుగు నీటి సరఫరా అవుతుందని వీధిదీపాలు వెలగడం లేదన్నారు. నూతనంగా సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని బస్తీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.

- నిత్యం డ్రైనేజీల నుంచి తాగునీటి సరఫరాలో కలుషిత నీరు సరఫరా అవుతుందన్నారు. దీంతో ప్రజలు అనారోగ్యాల బారినపడుతున్నామని బస్తీ మహిళలు ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం జ్యోతినగర్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తాము ఎదుర్కొంటున్న డ్రైనేజీ, వీధిదీపాలు, సీసీ రోడ్ల సమస్య పరిష్కారించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జ్యోతినగర్ బస్తీవాసుల విజ్ఞప్తి మేరకు వివిధ శాఖల అధికారులతో కలిసి బస్తీని పర్యటించామన్నారు.
- బస్తీలో పురాతన డ్రైనేజీ పైపులైన్ వల్ల నిత్యం డ్రైనేజీలు పొంగిపొర్లడంతో పాటు తాగునీటి సరఫరాలు కలుషిత నీటిసరఫరా అవుతోందని సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.
- వీధి దీపాలకు మరమ్మత్తులు చేపట్టి నూతనంగా సీసీ రోడ్డును ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు ఆదేశించారు. మున్సిపల్ ఉన్నతాధికారులు సన్నీ, ఏఈ సుభాష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, వాటర్‌వర్క్స్ సిబ్బంది యాదగిరి, దేవేందర్, జ్యోతినగర్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వామి, కార్యదర్శి రవిచారి, సంయుక్త కార్యదర్శి సురేష్, కోశాధికారి శంకర్, అసోసియేషన్ నేతలు కె.కృష్ణ, నర్సింగ్‌రావు, రాజు, మల్లేష్, బాబు, బీఆర్ఎస్ నేతలు వల్లాల శ్యామ్‌యాదవ్, ఎల్లయ్య, లక్ష్మణ్, ముచ్చుకుర్తి ప్రభాకర్, విక్కీ తదితరులు పాల్గొన్నారు.

నర్సింహ బస్తీ సమస్యలు పరిష్కరిస్తా

ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


నర్సింహబస్తీలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: నర్సింహ బస్తీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటానని అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. మంగళవారం నల్లకుంట డివిజన్ పరిధిలోని టీఆర్టీ కాలనీ, నర్సింహబస్తీలో జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పాదయాత్ర చేపట్టిన ఎమ్మెల్యే స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు బస్తీలో విద్యుత్ సమస్యలు, తాగునీటి పైప్‌లైన్ సమస్యతో పాటు డ్రైనేజీ సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే స్థానికుల విజ్ఞప్తి మేరకు సొంత సీడీపీ నిధులతో తాగునీటి పైపులైన్, నూతన డ్రైనేజీ పైపులైన్ వేయిస్తానని హామీ ఇచ్చారు.

- సీసీ రోడ్డు నిర్మాణం కోసం జీహెచ్ఎంసీ నుంచి అనుమతులు వచ్చాయని త్వరలోనే పనులను ప్రారంభిస్తామన్నారు. బస్తీలో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.
- టీఆర్టీ కాలనీలో రూ. 50 లక్షలతో ఎంఎస్ఆర్ పార్కులో చేపట్టిన సుందరీకరణ, అభివృద్ధి పనులను ఎమ్మెల్యే అధికారులతో కలిసి పరిశీలించారు. పార్కులో ఆధునీకరణ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. కాలనీ అసోసియేన్ ప్రతినిధులతో మాట్లాడి వారి అభిప్రాయం మేరకు పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. టీఆర్టీ పార్కు వద్ద 12 ఎంఎం డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటు చేయించాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. జలమండలి, జీహెచ్ఎంసీ ఆయా శాఖల అధికారులు, టీఆర్టీ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, నర్సింహ బస్తీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.భూపతినాథ్, శ్రీనివాస్, టీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, నాయకులు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత


సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, మేడే రాజీవ్‌సాగర్, వి.శ్రీనివాస్‌రెడ్డి

కవాడిగూడ: క్రీడల ద్వారానే మానసిక ప్రశాంతత సాధ్యమవుతుందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్‌లు అన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో నాయిని నర్సింహారెడ్డి జయంతి సందర్భంగా నాయిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన క్రికెట్ లీగ్–2 నాల్గో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పోటీలకు ముఖ్య అతిథులుగా ఫౌండేషన్ అధ్యక్షురాలు సమతారెడ్డి, ప్రధాన కార్యదర్శి మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులు నాయిని దేవేందర్‌రెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని క్రీడాకారులకు అన్ని విధాలుగా ప్రోత్సాహకాలను అందిస్తున్నామన్నారు. యువత విద్యతో పాటు క్రీడల్లో రాణించి దేశం, రాష్ట్రానికి మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యత, సృజనాత్మకత ఇలాంటి పోటీల ద్వారా బయటకు వస్తోందన్నారు. బీఆర్ఎస్ నేతలు కల్వ గోపీ, రమేష్, డేవిడ్, నేత శ్రీనివాస్, సిరిగిరి శ్యామ్, సిద్ధిఖ్, సాయియాదవ్, శివ, కార్తీక్, బాలయ్యతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అత్యాచార బాధితుల నిధులను దారి మళ్లిస్తారా !


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న డీబీఎఫ్ నాయకులు శంకర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార బాధితులకు చెల్లించాల్సిన నష్ట పరిహారం నిధులను దారి మళ్లిస్తారా అని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కన్వీనర్ పి.శంకర్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యాచార బాధితులకు చెల్లించాల్సిన రూ.10 కోట్ల నిధులను దారి మళ్లించడాన్ని ఆయన ప్రశ్నించారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దళిత బహుజన ఫ్రంట్, నేషనల్ అట్రాసిటీస్ ప్రివెన్షన్ ఫోర్స్, మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పి.శంకర్ మాట్లాడుతూ.. అత్యాచార బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరిలో రూ.5 కోట్లను మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వం మరో ఐదు కోట్లను జమ చేసి పది కోట్లకు బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ ఇచ్చి కలెక్టర్ ఖాతాలకు పంపి గంట వ్యవధిలోనే రిటర్న్ తీసుకుని బాధితులను మోసం చేసిందని ఆరోపించారు.

- రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు ఐదు వేల మంది బాధితులకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉందని బాధితులకు అందాల్సిన నష్ట పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.
- తక్షణ సాయం, నష్టపరిహారం, పునరావాసం కల్పించడం అనేది భిక్షకాదని ఇది బాధితుల హక్కు అన్నారు.
- పెండింగ్‌లో ఉన్న మొదటి, రెండో, మూడో దశలో చెల్లించాల్సిన నష్టపరిహారాన్ని బాధితులకు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. నష్టపరిహారం నిధులను వెనక్కు తీసుకునే స్థాయికి రాష్ట్ర ప్రభుత్వం దిగజారడం సిగ్గుచేటన్నారు. జూన్ 1వ తేదీ నాటికి నష్టపరిహారం చెల్లించకపోతే రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న చలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. వివిధ సంఘాల నాయకులు బత్తుల రాంప్రసాద్, శివలింగం, పులి కల్పన, డాక్టర్ నిమ్మ బాబురావు, శ్రీకాంత్, దాసు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని సందర్శించిన సీపీ


సీపీ ఆనంద్ డీసీపీలు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, ఏసీపీ యాదగిరి తదితరులు

చిక్కడపల్లి: నూతన పోలీస్‌స్టేషన్ భవనాన్ని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సందర్శించారు. మంగళవారం మధ్యాహ్నం వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న కార్మిక కమిషనర్ కార్యాలయంలో నూతనంగా రూపుదిద్దుకుంటున్న చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ నూతన భవనాన్ని ఆయన సెంట్రల్‌జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు, అదనపు డీసీపీ రమణారెడ్డి, చిక్కడపల్లి ఏసీపీ ఎ.యాదగిరి, చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఎస్.సంజయ్‌కుమార్‌లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. నూతన భవనంలో విశాలమైన గదులతో పాటు భవనం, లైబ్రరీ, కాన్ఫరెన్స్‌హాల్ విలేకరుల సమావేశానికి ఏర్పాటు చేసిన గదులు, పార్కింగ్ సౌకర్యం, విశాలమైన కారిడార్ తదితర అంశాలను చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి, ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కుమార్ సీపీకి వివరించారు. అదనపు ఇన్‌స్పెక్టర్ నరేశ్, ఎస్సైలు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

- ఈస్ట్‌జోన్ పరిధిలో నూతన పోలీస్‌స్టేషన్లు ఏర్పాటువుతున్న సందర్భంగా వాటిని పరిశీలించేందుకు వెళ్తున్న సీపీ దారిలో ఉన్న చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని పరిశీలించారు.

బీఎస్ స్ఫూర్తితో ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలి


బీఎన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భారత కమ్యూనిస్టు పోరాట యోధుడు భీమిరెడ్డి నర్సింహారెడ్డి (బీఎన్) స్ఫూర్తితో ఫాసిజం, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో తెలంగాణ సాయుధ పోరాట యోధులు, మాజీ ఎంపీ, ఎంసీపీఐ(యూ) పొలిట్‌బ్యూరో సభ్యులు బీఎన్‌రెడ్డి 15వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుధాకర్ మాట్లాడుతూ.. నాడు నిజాం ప్రభుత్వ అరాచకాలకు వ్యతిరేకంగా వెట్టి చాకిరి నిర్మూలనకు దున్నేవాడికి భూమి కావాలని పెద్ద ఎత్తున పోరాటం చేసిన గొప్ప కమ్యూనిస్టు యోధులని కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన అగ్రనాయకుల్లో బీఎన్‌రెడ్డి ఒకరని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తుకారామ్‌నాయక్, కుంభం సుకన్య, గాదె మల్లేష్, ఎర్ర రాజేష్, కిష్టయ్య, మురళీ, లలిత, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించే స్థాయికి విద్యార్థులు ఎదగాలి


సివిల్ జడ్జీలుగా అర్హత సాధించిన వారిని సత్కరిస్తున్న వివేక్, వినోద్ వెంకటస్వామిలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశం గర్వించదగ్గ స్థాయికి విద్యార్థులు ఎదగాలని అందులో భాగంగానే తమ అంబేడ్కర్ లా కళాశాలకు చెందిన నలుగురు జడ్జీలు కావడం గర్వకారణమని అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ జి.వినోద్‌వెంకటస్వామి అన్నారు. రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే అంబేడ్కర్ కళాశాలకు మంచి గుర్తింపు వచ్చిందన్నారు. మంగళవారం జూనియర్ సివిల్ జడ్జీలుగా అర్హత సాధించిన అనంతలక్ష్మి, అపూర్వ రవళి, రాజేశ్వర్, ఎస్‌వీ నాయకులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ.. కళాశాల చైర్మన్ వివేక్ మాట్లాడుతూ.. నలుగురు విద్యార్థుల సివిల్ జడ్జీలుగా అర్హత సాధించడం గొప్ప స్ఫూర్తిదాయకమన్నారు. ఇండియాటుడే సర్వేలో కూడా తమ కళాశాలకు మంచి గుర్తింపు, ర్యాంకు వచ్చిందన్నారు. లా చదవడాన్ని ఓ చాలెంజ్‌గా తీసుకోవాలని చెప్పే తీర్పులో కూడా న్యాయం, ధర్మం ఉండేలా జడ్జీలు చూసుకోవాలని కోరారు. ఇంతటి విజయం వెనుక తల్లిదండ్రులతో పాటు కళాశాల ఫ్యాకల్టీ కూడా ఉందన్నారు. కళాశాల జాయింట్ సెక్రటరీ రమణ, కరస్పాండెంట్ సరోజా, లా కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను భవిష్యత్తు తరానికి అందించాలి


వినతిపత్రం అందజేస్తున్న కోవిదా సహృదయ ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ అనుహ్యరెడ్డి

కాచిగూడ: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను రేపటి తరాలకు అందించాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. కోవిదా సహృదయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు, తెలంగాణ జానపద వృత్తి కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షురాలు, కళాబంధు డాక్టర్ అనూహ్యరెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం మంగళవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'కేంద్ర మంత్రి కళారంగానికి ఎంతో కృషి చేస్తున్నారని వారు మాటల మంత్రి కాదు చేతల మంత్రి అని' అన్నారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, చినుకు కల్చరల్ సొసైటీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, కవి విశ్లేషకులు పీఎస్‌మూర్తి, సంప్రదాయ శాస్త్రీయ నృత్య కళా గురువులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

కాచిగూడ: బీజేపీ బలోపేతానికి పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీజేవైఎం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.యశ్వంత్ ఆధ్వర్యంలో మంగళవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన పార్టీ పదాధికారుల సమావేశంలో కేంద్రమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందని విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి దోహదపడతాయన్నారు. ప్రజా ఉద్యమంలో పార్టీ కార్యకర్తలు ముందుండాలని పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందని భరోసా ఇచ్చారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో యువత పాత్రనే కీలకంగా ఉంటుందని స్పష్టం చేశారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, రాజశేఖర్ రెడ్డి, అవినాష్, రతన్, గోవింద్, అర్జున్, సంతోష్, శ్రీధర్, భరత్, ప్రవీణ్, వెంకట్, మన్మధ, భాస్కర్, దిలీప్ సింగ్, సునీల్, చక్రీ, విక్కిసింగ్ తదితరులున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

కార్పొరేటర్ పర్యటన



కాచిగూడ: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం గోల్నాక డివిజన్ మారుతినగర్‌లో ఆమె పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు.

మారోజు వీరన్న వర్ధంతి సభను జయప్రదం చేయండి


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఈనెల 16న బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే మారోజు వీరన్న వర్ధంతి సభను జయప్రదం చేయాలని బహుజన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.పర్వతాలు, బీఎల్ఎఫ్ చైర్మన్ నల్ల సూర్యప్రకాష్‌లు పిలుపునిచ్చారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద మారోజు వీరన్న వర్ధంతి సభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పూలే, అంబేడ్కరిస్టు, కమ్యూనిస్టులను ఐక్యం చేయడమే లక్ష్యంగా ఈ సభను నిర్వహిస్తున్నామన్నారు. బహుజన శ్రామికవర్గ రాజ్యస్థాపనే వీరన్నకు అర్పించే నిజమైన నివాళి అన్నారు. సుభాష్‌చంద్రబోస్, బుద్ధిస్టు తోకల సంజీవ్, రైతు సంఘం నాయకులు అంజి యాదవ్, విష్ణు తదితరులున్నారు.

రమేష్ ఐపీఎస్‌కు సత్కారం


సత్కరిస్తున్న సెంట్రల్ పీస్ కమిటీ ప్రతినిధులు ఎస్. శరత్ శ్యామ్ తదితరులు

కాచిగూడ: ఐజీపీగా పదోన్నతి పొందిన ఎం.రమేష్ ఐపీఎస్‌ను సెంట్రల్ పీస్ కమిటీ ప్రతినిధులు డీజీపీ కార్యాలయంలో కలిసి ఘనంగా సత్కరించి అభినందించారు. మంగళవారం రమేష్ ఐపీఎస్ మరిన్ని ఉన్నత పదవులు అదిరోహించాలని ఈ సందర్భంగా పీస్ కమిటీ అసిస్టెంట్ సెక్రటరీ ఎస్.శరత్ శ్యామ్ ఆకాంక్షించారు. సెంట్రల్ పీస్ కమిటీ ప్రతినిధులు డాక్టర్ మజారుద్దీన్, యూసుఫ్ హమీద్, ఎస్. శరత్ శ్యామ్, వేముల విజయ్‌కుమార్, దిలీప్ జైన్, యూనాస్, ఖలీద్, ఇషాక్, ప్రదీప్, రెహమన్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.20 లక్షలతో సీసీ రోడ్డు పనులు


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: అంబర్‌పేట్, పటేల్‌నగర్‌లో రూ.20 లక్షలతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభించారు. మంగళవారం డివిజన్‌లో అవసరమైన అన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్ విజయ్‌కుమార్, వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం


నవీన్ (ఫైల్)

కాచిగూడ: గోల్నాక అన్నపూర్ణనగర్‌కు చెందిన మట్టపల్లి నవీన్ డిగ్రీలో కొన్ని సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో ఇంట్లోని వారు మందలించారు. దీంతో మనస్థాపం చెంది ఈనెల 7న ఇంట్లో నుంచి వెళ్లి ఇప్పటి వరకు తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మేనమామ అంబర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వారు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో వృద్ధురాలు..


రణమ్మ (ఫైల్)

నల్లకుంట: కుమార్తె వద్ద రెండు రోజులు ఉండేందుకు వచ్చిన ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం .. బెజవాడ రణమ్మ(75) ఉప్పుగూడ వాంబే క్వార్టర్స్‌లో నివాసముంటుంది. ఈ నెల 2న పెద్ద కుమార్తె కె. గీత ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో ఈ నెల 4న మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుమార్తె సోదరి అనంత లక్ష్మికి సమాచారం ఇవ్వగా.. వారు మంగళవారం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా తమ తల్లికి కొద్ది రోజులుగా మతిస్థిమితం సరిగ్గా లేదని అనంతలక్ష్మి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220383